క్లుప్తంగా

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న పల్లి ఆశ్రమ స్వామీజీ

బొండపల్లి: రోజూ ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని పల్లి ఆశ్రమానికి చెందిన స్వామీజీ అన్నారు. గొట్లాం గ్రామంలోని పిరమిడ్ సేవాదళ్ ఆశ్రమంలో ధ్యానంపై శనివారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈసమస్యల నుంచి బయటపడి ప్రశాంతంగా ఉండేందుకు ధ్యానం, యోగా చేయడమే మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఆహార అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



డాక్టర్ వేణు



డాక్టర్ సంజని

వేపాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇది వరకు పనిచేసిన వైద్యాధికారి రాజుకు బదిలీ కాగా, మరో వైద్యాధికారి ధరణికి పీజీ చేసేందుకు వెళ్లి పోవడంతో ఇక్కడి వైద్యాధికారుల పోస్టులు ఖాళీ అయ్యాయి. వీరి స్థానంలో కళ్లేపల్లిరేగ పీహెచ్ సీ వైద్యాధికారి అజయ్‌కుమార్ ఇన్నాళ్లూ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తాజాగా ప్రభుత్వం ఇక్కడికి వైద్యాధికారులు ఎం.వేణు, సంజనిని నియమించింది. వీరిద్దరూ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వేపాడ: కుమ్మపల్లి గ్రామంలో నూకాలమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో రెండురోజు శనివారం గ్రామ పురోహితులు భమిడిమర్రి శ్రీనివాసరావుశర్మ నేతృత్వంలో వేద పండితులు గ్రామస్తులతో సూర్యనమస్కారాలు, మహాన్యాస పూర్వక అభిషేకాలు, పంచశయ్యాదివాసం, హోమాలు చేయించారు. ఆదివారం ఉదయం 6.42 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు తెలిపారు.

మద్యానికి బానిసకావొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ జనార్దనరావు

దత్తిరాజేరు: మద్యానికి బానిసగా మారి ఆరోగ్యం, జీవితాన్ని పాడుచేసు కోవద్దని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జనార్దనరావు సూచించారు.మద్యం తాగడం ద్వారా కలిగే అనర్థాలపై పెదమానాపురం సంతలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారినపడి ఎంతోమంది మృతి చెందుతున్నారని, దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కొంతమంది మద్యం మత్తులో నేరాలు చేసి జైలు పాలవుతున్నారని, అన్ని అనర్థాలకు కారణమైన మద్యానికి దూరంగా ఉండాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ కంప్యూటర్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీలో అడ్మిషన్ లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శనివారం తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, బోయ్స్, గర్ల్స్‌కు ఉచిత హాస్టల్ సదుపాయం కలదని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 95819 67709, 83415 48582 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

తగ్గిన టికెట్ ధర

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రం నుంచి ధర్మవరం మీదుగా ఎస్.కోట వెళ్లే రూట్‌లో టిక్కెట్ ధర తగ్గిస్తున్నామని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూట్‌లో ఇంతవరకు తొమ్మిది స్టేజీలుండగా.. వాటిని ఎనిమిదికి తగ్గించి రూ.55 ఉన్న టికెట్ ధరను 50 రూపాయలు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందన అంతంత మాత్రమే..!

- రిజిస్ట్రేషన్ సంబంధిత ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సేవలపై అవగాహన కరువు
- రోజుకు 72 స్లాట్స్‌కు 30 లోపే నమోదు



రిజిస్ట్రేషన్‌లకు వచ్చిన ప్రజలతో రద్దీగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

గజపతినగరం రూరల్: సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీని తగ్గించేందుకు రాష్ట్ర స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖ గత నెల 20 నుంచి ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ కార్యక్రమం మొదలు పెట్టింది. అయితే స్లాట్ బుకింగ్‌పై కక్షిదారులకు అవగాహన కలిగించకపోవడంతో స్లాట్స్ బుకింగ్స్ తక్కువగా నమోదవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజూ 72 స్లాట్స్ జరగాల్సి ఉండగా కేవలం రోజుకు 20 నుంచి 30 వరకు మాత్రమే స్లాట్స్ బుకింగ్ జరుగుతున్నాయని సంభందిత అదికారులు చెబుతున్నారు.

ఏప్రిల్ 21 నుంచి గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్స్ వివరాలు

తేదీ	బుకింగ్ వివరాలు
21-04-2025	28
22-04-2025	18
23- 04-2025	24
24-04-2025	28
25-04-2025	19
26-04-2025	12
28- 04-2025	19
29- 04-2025	21
30-04-2025	18

రోజూ 72 స్లాట్స్ అవ్వాల్సిందే

ఏదైనా ఆన్‌లైన్ కేంద్రంలో ముందుగా సంబంధిత రిజిస్ట్రేషన్‌కు అనువైన, ఖాళీ ఉన్న సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి.అందులో కేటాయించిన సమయంలో స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది.గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజూ 72 స్లాట్స్ చేసుకునేందుకు అందుబాటులో ఉన్నట్లు సమాచారం.స్లాట్ బుక్ చేయకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అవకాశం ఉండదని అధి కారులు చెబుతున్నారు .ప్రస్తుతం గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులో ఉంది. స్లాట్ బుక్‌చేసుకుని దస్తావేజు మొత్తం సిద్ధం చేసుకుని ఎస్ఆర్ఓ కార్యాలయంలోకి వెళ్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవకాశం కలుగుతుంది. అయితే దీనిపై కక్షిదారులకు కనీస అవగాహన కలిగించడంలో అధికారులు విఫలమవ్వడంతో స్లాట్ బుకింగ్స్ అనుకున్నంతగా అవ్వడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..



స్లాట్ బుకింగ్ విధానం చాలా సులభతరం. ఈవిషయంలో కక్షిదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా తాము అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం .స్లాట్ బుకింగ్ వల్ల పెద్దగా ఇబ్బందులు ఉండవు. గంటలకొద్దీ క్యూలో నిల్చునే అవసరం ఉండదు. తొందరగానే ఎటువంటి మధ్యవర్తులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈనూతన విధానంపై అవగాహన పెరిగే వరకు స్లాట్స్ తక్కువగానే అవుతాయి.

– తవిటయ్య, సబ్ రిజిస్ట్రార్, గజపతినగరం

దళారుల హవా

దళారులను నివారించేందుకు కూటమి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఏర్పాటు చేసినప్పటికీ గజపతినగరం రిజిస్ట్రేషన్ కార్యా లయంలో దళారుల హవా తగ్గలేదు. వారితోపాటు కక్షిదారులు లోనికి వస్తేనే దస్త్రాలు కదులుతున్నట్లు సమాచారం. సబ్ రిజి స్ట్రార్ చాంబర్ వద్దకు నేరుగా దళారులు వెళ్లి ఫైళ్లను అందించిన తీరు ఇంకా ఇక్కడ కొనసాగుతునే ఉంది. ఒకవైపు ఉన్నతా ధికా రులు దళారులను లోపలకు రానీయకూడదని పదేపదే దిగువ స్థాయి అధికారులకు చెబుతున్నప్పటికీ వారిని నివారించడంలో కార్యాలయ సిబ్బంది విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విలేజ్ హెల్త్ క్లినిక్ దుస్థితి



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదో మూతపడిన ప్రభుత్వ కార్యాలయం కాదు. ప్రజలకు వైద్య సేవలందిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్. ఇదేదో మారుమూల పల్లెటూరిలో లేదు. మండల కేంద్రంలోని వంగపల్లిపేట సచివాలయ ఆవరణలో ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలతో వినియోగంలో లేని భవనంలో దర్శనమిస్తోంది. అదే ఆవరణలో రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం ఉన్నప్పటికీ విలేజ్ హెల్త్ క్లినిక్ చుట్టూ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. క్లినిక్‌కి వచ్చే ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు చెప్పే సిబ్బంది తమ కార్యాలయం ఎలా ఉందో చూసుకోకపోవడం గమనార్హం. – చీపురుపల్లి

అమ్మకు పాదపూజ



మదర్స్ డే సందర్భంగా ఐసీడీఎస్ వియ్యంపేట ప్రాజెక్టులోని ఎల్.కోట సెక్టార్ పరిధిలోని 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అమ్మకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలు తమ తల్లుల పాదాలను కడిగి పూజ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నైతిక విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు.అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. – లక్కవరపుకోట

రామాలయంలో ఎమ్మెల్సీ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని చెల్లాపురంలో ఇటీవల ప్రతిష్ఠించిన కోదండ రామాల యంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు శనివారం ప్రత్యేక పూజలు చేశా రు. ప్రజలందరిపై ఆ కోదండరాముని చల్లని దీవెనలు ఉండాలని కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్‌రూల్స్ సాధిస్తామని, సీపీఎస్ రద్దుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని, బదిలీల్లో ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరిపిస్తామని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల జీతంతో పాటు, సర్వీసును 62 సంవత్సరాలకు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ కర్రోతు నాగేశ్వరరావు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీరాములు, పీఆర్టీయూ మండల నాయకులు ఆర్.సింహాద్రి, ఆల్తి శ్రీహరి, చిట్టిరామునాయుడు, ఆల్తి బుచ్చిబాబు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ అమలుకు చర్యలు తీసుకోండి



ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు

మెరకముడిదాం: తమకు ఎంటీఎస్(మినిమం టైమ్ స్కేల్) అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు మండలానికి చెందిన పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని చెల్లాపురం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడును పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు కలిసి తమ సమస్యలను వివరించారు. 2012 నుంచి పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేస్తున్నామ ని, తమకు ఇంతవరకు ప్రభుత్వం ఎంటీఎస్ అమలు చేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను భద్రపరిచిన స్టాక్ పాయింట్లలో విధుల నుంచి తమను తప్పించి, కేవలం పాఠశాలలకు కిట్లు పంపిణీ చేసే బాధ్యతలను మాత్రమే అప్పగించేలా ప్రభుత్వం నుంచి ఉత్త ర్వులు వచ్చేవిధంగా కృషి చేయాలని అభ్యర్థించారు. అలాగే చాలీ,చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, వేతనాలు పెంచేలా ప్రభు త్వంతో చర్చలు జరపాలని, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ అనే పేరును తొలగించి ఒకేషనల్ టీచర్లగా మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం అధ్యక్షుడు నాగూర్ నవీన్‌కుమార్, దేవా, అనిల్, సూర్యం, లీలా, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రైల్వే ఏఎస్ఐ పాణిగ్రాహి

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామస్తులకు రైలు ప్రమాదాలపై విజయనగరం రైల్వే పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఏ.కె.పాణిగ్రాహి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ పక్కనున్న గ్రామస్తులు రైళ్ల రాకపోకల సమయంపై అవగాహన కలిగి ఉండాలని, ఎలా పడితే అలా, ఎప్పుడుపడితే అప్పుడు పట్టాలు దాటడం నేరమని అన్నారు. ఇది వరకు గ్రామాన్ని ఆనుకుని రెండు రైల్వే ట్రాకులు ఉండేవని, ఇప్పుడు మూడో లైన్ రావడంతో రైళ్ల రాక పోకలు మరింత పెరగాయని చెప్పారు. పొలం, ఇతర పనులకు వెళ్లే వారు రైళ్ల రాకపోకలను గుర్తించక, ఏమరపాటుగా పట్టాలు దాటేసమయంలో రైళ్లు ఢీకొని మృతి చెందిన వారు చాలామంది ఉన్నారన్నారు. చిన్న పిల్లలను రైల్వే ట్రాక్‌ల వైపు వెళ్లనీయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. రైల్వే శాఖకు సంబంధించిన వస్తువులను దొంగిలిస్తే కేసులు నమోదు చేస్తామని, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. రైల్వే పోలీసులు మాధవరావు, జి.రాజు, గ్రామపెద్దలు పోతల శంకరరావు, కృష్ణ పాల్గొన్నారు.

చేపల తరలింపును అడ్డుకున్న అధికారులు



చేపల వేటను అడ్డుకున్న ఉద్యోగులు

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధి రొంగలివాని చెరువులో శనివారం అక్రమంగా చేపలు పడుతున్న వ్యక్తులను స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, వీఆర్‌ఓ నాయుడు అడ్డుకున్నారు.రొంగలివాని చెరువుతో పాటు మరో మూడు ప్రభుత్వ చెరువుల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, విశాఖ వ్యక్తి ఈ చెరువులు మంచినీటి చెరువులని చేపల పెంపకం చెల్లదని కోర్టులో వాజ్యం దాఖలు చేశారు. దీంతో కేసు కొలిక్కి వచ్చేవరకూ ఎవ్వరికీ ఎటువంటి హక్కులు లేవని ఉద్యోగులు స్పష్టం చేశారు. చెరువులో చేపల వేటకు వచ్చిన అప్పారావు అనే వ్యక్తి 15 ఏళ్లుగా ఈ చెరువుల్లో చేపల పెంపకం చేసి వ్యాపారం చేస్తున్నామని, గతేడాది పంచాయతీలో కొందరు పెద్దలకి రూ.40వేలు ఇచ్చి చేపలు పట్టుకున్నామని, ఇప్పుడు కొత్తగా అభ్యంతరాలు పెడుతున్నారని వాదనకు దిగాడు. దీంతో అధికారులు తమకు సంబంధం లేని విషయాలతో వాదన వద్దని, కోర్టు వ్యవహారం తేలాక చేపల వేటకు అనుమతిస్తామని ఉద్యోగులు చెప్పారు.

నేటి నుంచి వెదుళ్లవలసలో గ్రామదేవతల పండగ



వెదుళ్లవలస గ్రామదేవత పైడితల్లమ్మ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలసలో నాలుగురోజుల పాటు నిర్వహించనున్న గ్రామదేవతలు పైడితల్లి, బంగా రమ్మ పండగ ఆదివారం ప్రారంభం కానుంది. 2005లో పండగ నిర్వహించామని, మళ్లీ 20 ఏళ్ల తర్వాత పండగ జరిపేందుకు నిర్ణయం తీసు కున్నామని గ్రామపెద్దలు శనివారం తెలిపారు. తొలిరోజు ఆదివారం గ్రామ దేవతలకు పసుపు, కుంకుమలతో పూజలు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం రథోత్సవం, బుధవారం కనుమ పండగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి, మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని గ్రామపెద్దలు తెలిపారు.

రేపటి నుంచి బొర్రా పైడితల్లమ్మ పండగ

గంట్యాడ: మండలంలోని పెంట శ్రీరాంపురం గ్రామంలో ఈనెల 12, 13, 14వ తేదీల్లో బొర్రా పైడితల్లమ్మ పండగ నిర్వహించనున్నట్టు ఆ గ్రామ సర్పంచ్ కరక గౌతమి శనివారం తెలిపారు. 12వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 13వ తేదీన సిరిమానోత్సవం ఉంటుందని చెప్పారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి



మాట్లాడుతున్న ఈయూ నాయకుడు దామోదరరావు

శృంగవరపుకోట: ఆర్టీసీలో ఉన్న సమస్యల పరిష్కారంపై కూటమి సర్కారు నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తోందని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆర్టీసీ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.జి.నాయుడు, కె.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈయూ నాయకుడు పి.దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ విలీనం తర్వాత చెల్లించాల్సిన 24 నెలల ఎరియర్స్, నాలుగు డీఏలు, సరండర్ లీవులు, లీవ్ ఎన్ క్యాష్‌కు సంబంధించి చెల్లింపులు జరగలేదన్నారు. 2023 జూన్ నుంచి రావాల్సిన 12వ పీఆర్సీకి కమిషన్ నియమించలేద ని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఆవిరైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ పదోన్నతులకు సంబంధించి గత ఆరేళ్లగా ప్రభుత్వం వద్ద ఉన్న ఫైళ్లకు క్లియరెన్స్ ఇచ్చి 3,500 మంది ఉద్యోగులకు పదోన్నతులు వచ్చేలా చూడాలన్నారు. క్లరికల్ విభాగంలో 10వేల పోస్టుల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. జిల్లా ఈయూ అధ్యక్షుడు కె.కృష్ణారావు, కార్యదర్శి జి.రవికాంత్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తితో పాటు పలువురు వక్తలు ఆర్టీసీలో ఉన్న అపరిష్కృత సమస్యలపై ధ్వజమెత్తారు. సమావేశంలో ఇతర డిపోల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ఈయూ సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందని ఎంఎస్ఎంఈ, సెర్ప్,ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కొండకిండాం గ్రామంలో సర్వే నంబర్ 67లోని 57.49 ఎకరాల కొండపోరంబోకు భూమిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తొలి విడతలో 25 ఎకరాల్లో రూ.17.80 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఇక్కడి పార్కులో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందు వచ్చే వారికి భూమితో పాటు విద్యుత్, నీరు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతుమాధవన్, ఆర్డీఓ దాట్ల కీర్తి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, సర్పంచ్ పెద్దమజ్జి ఆదిలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో రక్షిత మంచి నీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కార్తీక్ శనివారం పరిశీలించారు. వాటర్ ట్యాంకు శుభ్రం చేయడంపై పంప్ ఆపరేటర్‌కు పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. 35 గ్రామ పంచాయతీల్లోనూ తాగునీటి వనరులను, రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

• చెరువు గట్టు దురాక్రమణ



చెరువు గట్టును తవ్వేసిన దృశ్యం

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం రెవెన్యూ పరిధిలోని వెంకన్న చెరువు గట్టును చెరువును ఆనుకుని పొలం ఉన్న ఓ రైతు జేసీబీతో తవ్వేసి ఆక్రమించుకున్నారని ఆ గ్రామానికి చెందిన ఇతర రైతులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు పాల్పడిన రైతు తన పొలానికి సమాంతరంగా గట్టును తవ్వించేశారని ఆయకట్టు రైతులు అంటున్నారు. సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంటుందని చెబుతున్నారు. అయితే చెరువు గట్టును జేసీబీతో తవ్వేయడంతో ఆ ప్రాంతంలో గట్టు బలహీన పడిందని, వర్షాకాలంలో చెరువు పూర్తిస్థాయిలో నీటితో నిండితే గట్టు గండికొట్టే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి, గట్టును పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని రైతులు చెప్పారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగించుకోండి



సబ్ జైల్‌లో తనిఖీలు చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

చీపురుపల్లి: సబ్ జైళ్లలో ఉన్న ముద్దాయిలకు న్యాయ సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ సూచించారు. పట్టణంలోని సబ్‌జైల్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. జైల్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి, విధులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ సబ్ జైళ్లలో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కర్తవ్యమన్నారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు న్యాయవాదులు లేకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వంటగది ని పరిశీలించి, జైల్‌లో సదుపాయాలపై రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.